ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY







భక్తి శ్రద్ధలతో బక్రీద్

హిందూపురం ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



↑ పుట్టపర్తి ఈద్గాలో ఖుత్బాను పఠిస్తున్న ఇమాం

కదిరి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు →

- ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

పుట్టపర్తి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, కదిరి తదితర ప్రాంతాలలో శనివారం ఉదయమే ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వజూ అనంతరం ర్యాలీగా ఈద్గాలకు చేరుకున్నారు. సామూహిక ప్రార్థన, ఇమాం ఖుత్బా పఠనం, దువా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ శక్తిమేరకు ఖుర్బానీ చేశారు. మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒకటి తమ కుటుంబానికి, రెండోది బంధువులకు, మూడో భాగాన్ని పేద ముస్లింలకు పంచిపెట్టారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఈద్గాల వద్ద పోలీసులు భద్రత కల్పించారు.

సహకారం.. అస్తవ్యస్తం..!

ఏడీసీసీ బ్యాంకులో ఇష్టారాజ్యం.. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఎస్, నియామకాలు

డీసీఎంఎస్ స్థలంపై కేటుగాళ్ల కన్ను

అనుమతి లేకుండా నిర్మాణాలు

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

కొత్త చైర్మన్లకు సవాళ్లు



అనుమతి లేకుండా నిర్మించిన దుకాణాల సముదాయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో సహకార వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయింది. పాలకులు, అధికారులు ఇష్టారాజ్యంగా ఎవరికి దొరికింది వారు దోచేశారనే విమర్శలు ఉన్నాయి. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ను భ్రష్టు పట్టించారు. ఏళ్లుగా ఒకే స్థానంలో పాతుకుపోయిన అధికారులు నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారాజ్యంగా దోచేశారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లో జరిగిన అక్రమాలపై కొత్త చైర్మన్లు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనంతపురం నగరం గుత్తిరోడ్డులో ఉన్న డీసీఎంఎస్ స్థలానికి గత ప్రభుత్వంలో కొందరు పట్టాలు సృష్టించారు. సొసైటీలను కంప్యూటరీకరణ చేసినప్పటికీ సంస్థాగతంగా, ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. 2014-19 మధ్య లాభాలతో సాగిన సొసైటీలను 2019-24 మధ్య కాలంలో నష్టాల ఊబిలోకి నెట్టేశారు. చివరికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలోకి తీసుకువచ్చారు. ఉమ్మడి జిల్లాలో గతంలో 120 సొసైటీలు ఉండేవి. వైసీపీ హయాంలో 108కి తగ్గించారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో వారు సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏడీసీసీ బ్యాంకును బజారున పడేశారు..

వైసీపీ ప్రభుత్వంలో ఏడీసీసీ (అనంతపురం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్) బ్యాంకులో ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలతో తీరని నష్టం వచ్చింది. ఉద్యోగ నియామకాల్లో సుమారు రూ.10కోట్ల వరకు చేతులు మారాయనే ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వంలో అసిస్టెంట్ మేనేజర్ స్థాయిలో ఉన్న శ్రీధర్ ఆరోగ్యం సక్రమంగా ఉన్నా.. కర్నూలు మెడికల్ బోర్డు తిరస్కరించినా, నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఎస్

(మిగతా 6లో...)

క్షీరం...గరళం..!

- ప్యాకెట్‌పాలు సురక్షితమేనా? • రోజుల తరబడి నిల్వతో ప్రమాదం

- నాసిరకం ప్లాస్టిక్ కవర్లతో ముప్పు
- గ్రామాల్లో కూడా విచ్చవిడిగా కల్తీ
- సేవిస్తే దీర్ఘకాలంలో తప్పని జబ్బులు

పట్టించుకోని ఆహార కల్తీ నిరోధక శాఖ



జిల్లాలో చాలా వరకు పట్టణాలు, ఓ రకమైన మండల కేంద్రాల్లో కల్తీతోనే రోజు ప్రారంభం అవుతోంది. ప్రస్తుత కాలంలో ప్రజలు ఉదయం లేవగానే కాఫీనో, టీనో గొంతులో దిగందే ఏ పని మొదలు పెట్టడం లేదు. దీంతో పాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా పాలలో కల్తీ విపరీతంగా పెరిగిపోయింది. ఈ కల్తీ పాలు ప్రజారోగ్యాన్ని బాగా దెబ్బతీస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పుట్టపర్తి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కల్తీ పాల వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిసినా, విధిలేని పరిస్థితుల్లో ప్రజలు వివిధ రకాల కంపెనీల పాలు కొనుగోలు చేస్తున్నారు. డిమాండును ఆసరా చేసుకుని చిరు వ్యాపారులు మొదలు కంపెనీల వరకు పాలను కల్తీ చేసి ప్రజలకు అంటగడుతున్నారు. జిల్లాలో సుమారు 10 కంపెనీలు పాలప్యాకెట్లు తయారుచేసి మార్కెట్‌కు తరలిస్తున్నాయి. ఇందులో ఎన్ని



కంపెనీలు నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్నాయో తెలియడంలేదు. మేమేం తక్కువ కాదన్నట్లు గ్రామాల్లోని పాల వ్యాపారులు కూడా హానికర రసాయనాలతో పాలను తయారుచేసి డెయిరీలకు సరఫరా చేసేస్తున్నారు. ప్రతిరోజు లక్షల్లో పాలు, పెరుగుప్యాకెట్లు (మిగతా 6లో..)



ఏవైనా కల్తీనే..!

ప్యాకెట్ పాలతో పాటు కొందరు చిరు వ్యాపారులు కూడా కల్తీ చేసి పాలను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రైతుల నుంచి పాలను కొనుగోలు చేస్తున్న చిన్న వ్యాపారులు వాటిని కల్తీచేసి డెయిరీలకు అమ్మేస్తారు. ఉదాహరణకు 15లీటర్ల పాలలోకి 25లీటర్ల నీటిని పోసి అందులోకి ఓ రకమైన పౌడర్, వంటనూనె, యూరియా వంటి వాటిని కలిపి డెయిరీలకు విక్రయిస్తున్నారు. వీటిని కొన్న డెయిరీలు కొద్దిరోజులు నిల్వ చేస్తారు. వాటిని ప్యాకెట్లలో నింపి ప్రధాన కేంద్రాలకు తరలించే ప్రక్రియలో కొద్దిరోజులు గడిచిపోతాయి. ఇలా ప్యాకెట్‌పాలు తయారు కావడానికి దాదాపు 10రోజుల సమయం పడుతుంది. సాధారణంగా నిల్వ చేసే పాలు ఒక రోజుకే పాడైపోతాయి. అలాంటిది పదిరోజులు నిల్వచేసినా పాడైపోలేదంటే వాటిలో ఎన్నిరకాల రసాయనాలు కలిపి ఉంటారో ఊహించుకోవచ్చు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4188 మంది పరీక్షలు రాయగా 1902 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఉత్తీర్ణతా శాతం 45గా నమోదైంది. దీంతో రాష్ట్రంలో 13వ స్థానం లభించింది. ద్వితీయ సంవత్సరంలో 2199 మంది పరీక్షలు రాయగా 1437 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 65గా నమోదైంది. జిల్లాకు 9వ స్థానం దక్కింది.

దోషులను కఠినంగా శిక్షించాలి

అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి

వివిధ సంఘాల నాయకుల డిమాండ్

పోలీసుల అదుపులో మరో ఐదుగురు

నేడు 12 మంది నిందితులు కోర్టుకు..



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు

రామగిరి/అనంతపురం సెంట్రల్/కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరాయి. కాగా, ఈ ఘటనలో మరో ఐదుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఇప్పటి వరకూ పట్టుబడిన మొత్తం 12 మందిని ఆదివారం న్యాయాధికారి ఎదుట హాజరుపరుస్తారని తెలిసింది. ఈ ఘటనను పోలీసు శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. బాలికపై లైంగిక దాడి చేసిన 13 మందిని, వారిని ఈ కేసు నుంచి తప్పించాలనుకున్న మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశారు. ముగ్గురు పరారీలో ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

- బాలికపై అత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గణేనాయక్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదరికాన్ని, సామాజిక వెనుకబాటుతనాన్ని అవకాశంగా తీసుకుని దళితురాలిపై 14 మంది అత్యాచారానికి పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. నిస్సహాయ బాధితురాలికి అండగా నిలవాల్సిన సమయంలో పరస్పర విమర్శలు చేసుకోవడం నిందితులకు తోడ్పాటవుతుందని ప్రధాన పార్టీలు గుర్తించాలని హితవు పలికారు. ఈ దుర్మార్గ (మిగతా 6లో...)

చుక్కల చిక్కులు



వడ్డుమరపల్లి వద్ద చుక్కల భూములు

- చుక్కలు తొలగించుకోవడానికి రైతుల ఇబ్బందులు
- చేయి తడపందే ఫైల్ సిద్ధం చేయని రెవెన్యూ సిబ్బంది
- అమ్ముకోలేక రైతులు... రిజిస్టర్ కాక వ్యాపారుల అవస్థ

తనకల్లు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టా భూములను కూడా చుక్కల భూములుగా నమోదు చేయడంతో వాటిని తీయించలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2016-17 మధ్య కాలంలో ఈచుక్కల భూముల తంతంగం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి రైతులు ఈ చుక్కల భూములను అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. కొన్నవారు సైతం రిజిస్ట్రేషన్ కాక అవస్థలు పడుతున్నారు. చుక్కలు తొలగించాలని తిరుగుతున్న రైతులకు రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోంది. చుక్కల భూములకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసి, సంబంధిత వీఆర్‌ఓ, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు పంపాలంటే రెవెన్యూ యంత్రాంగానికి చేయి తడపాల్సి వస్తోంది. అయినా చుక్కలు తొలగించే ఫైల్ సిద్ధం చేయడం ఇక్కడున్న సిబ్బందికి చేతకావడం లేదు. దీంతో రైతులు రిటైర్డ్ అయిన రెవెన్యూ అధికారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో వారికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇన్ని అగచాట్లు పడి ఫైల్ సిద్ధం చేసి అధికారుల వద్దకు పంపితే వారు చుక్కలు తొలగిస్తారో లేదో అర్థం కాని పరిస్థితి. దీంతో చుక్కల భూములున్న రైతులు ఎవరూ ఒంటరిగా చుక్కలు తొలగించాలని రెవెన్యూ అధికారులను అడగటం లేదు.

'చుక్కల' బేరాలు

కొందరు కొనుగోలుదారులు రైతుల వద్దకు వెళ్లి మీవి చుక్కల భూములని, రిజిస్టర్ కావని చెప్పి, తక్కువ ధరలకు బేరాలడుతున్నట్లు సమాచారం. మరికొందరు కొనుగోలుదారులు రైతులకు రూ.లక్షలు అడ్వాన్సులు ఇచ్చి చెప్పిన సమయంలోగా రిజిస్ట్రేషన్ చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో రైతులు కూడా అగ్రిమెంటు సమయం అయిపోయింది కనుక భూములు రిజిస్టర్ చేయించేది లేదంటూ మొండికేస్తున్నారు. దీంతో సమయం దాటిపోకముందే మరోమారు ధరలు పెంచి అగ్రిమెంట్లు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తనకల్లు మండలంలోనే రెండు వేల ఎకరాలదాకా చుక్కల భూములున్నట్లు రైతులంటున్నారు. ఒక ఎకరం భూమి చుక్కలు తొలిగించుకోవాలంటే ఫైల్ సిద్ధం చేయడం మొదలుకుని, అధికారుల సంతకాలు పూర్తి చేయించడాని రూ.లక్షకు పైగా ఖర్చు అవుతున్నట్లు బహిరంగంగానే వినిపిస్తోంది. ఇంత జరుగుతున్నా, రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తోందే తప్ప, భూముల చుక్కలు తొలగించాలన్న ఆలోచన చేయడంలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే చుక్కలు తీస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. ఇంతవరకు చుక్కలు తీయకపోవడంతో రైతులు, వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

ఉన్నతాధికారుల నిర్ణయాలను అమలు చేస్తాం

గతంలో కొంతమంది ఫైల్ సిద్ధం చేసుకుని చుక్కల భూముల్లో చుక్కలను తొలగించుకున్నారు. చుక్కల భూముల విషయంలో ఉన్నతాధికారుల నిర్ణయాలను మాత్రమే మేము అమలు చేస్తాం.

\- శోభాసువర్ణమ్మ, తహసీల్దార్

ఇప్పుడెందుకొచ్చాయో



మా గ్రామం వద్ద వందలాది ఎకరాలు చుక్కల భూములుగా ఉన్నాయి. ఇప్పటికే ఈ భూములను విక్రయించాం. ఒకసారి ఎకరాకు రూ.లక్ష అడ్వాన్సు ఇచ్చారు. ఆ సమయం అయిపోవడంతో మరోమారు అదనంగా రూ.50వేలు రేటు పెంచి మరో రూ.లక్ష ఇచ్చారు. ఇప్పటికి సమస్యల పరిష్కారం కాలేదు. దీంతో అటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటు భూములమ్మిన మేము డబ్బులు చేతికి రాక నష్టపోతున్నాం. గతంలో లేని చుక్కలు ఇప్పుడెందుకొచ్చాయో తెలియదు.

\- రాజా, రైతు, వడ్డుమరవపల్లి

అమ్మాలంటే చుక్కలంటున్నారు



తవళం గ్రామం సర్వేనెంబర్ 743లో నాపేరుపై భూమి ఉంది. ఈ భూమిని అమ్ముకోవాలంటూ చుక్కలున్నాయంటున్నారు. మాకు పెద్దల నుంచి సక్రమించిన ఆస్తిని చుక్కలనడంతో అర్థమేమో తెలియడం లేదు. గతంలో ఈసర్వే నెంబర్ భూమిలోనే ఎంతోమంది అమ్మకాలు, కొనుగోలు సాగించారు. ప్రస్తుతం చుక్కల కారణంగా అమ్ముకోలేక పోతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కరించాలి.

\- కమలమ్మ, భూయజమానురాలు, గంగసానిపల్లి

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు

పుట్టపర్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయి భక్తులు చేపట్టిన సంగీత గాన కచేరి భక్తులను అలరింపచేసింది. రెండోరోజు శనివారం సాయికుల్వంతు సభామండపంలో శ్రీసత్యసాయి గ్లోబల్ మహిళా సదస్సు కొనసాగింది. దేశవిదేశాలకు చెందిన పలువురు మహిళా ప్రతినిధులు సమాజంలో మహిళ పాత్రపై ప్రసంగించారు. అనంతరం మహిళా భక్తులు సంగీత గానకచేరి నిర్వహించారు. సదస్సులో వేలాది మందిలో మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన మహిళా ప్రతినిధులు


అమ్మో జూన్ ..!

చదువులు, సేద్యానికి ఒకేసారి ఖర్చు
మరోవైపు బ్యాంకుల్లో రుణాల రెన్యువల్
ప్రతి ఏటా పెరుగుతున్న ఖర్చులు
ఆందోళనలో సామాన్య, మధ్య తరగతి వర్గాలు

చిలమత్తూరు/ కొత్తచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏడాదిలో సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు ఓ స్థాయిలో ఉన్న వారు సైతం బెంబేలెత్తే మాసం జూన్. ఖరీఫ్ సీజన్‌తో పాటు వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యేది ఈ నెలలోనే. దీంతో వ్యవసాయ పనులు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, పిల్లల పుస్తకాలు, యూనిఫామ్, స్కూలు ఫీజులు చెల్లించడానికి ఆయా వర్గాల ప్రజలకు చేతి చమురు వదులుతోంది. ప్రతి అంశము ఆర్థికపరమైనది కావడంతో డబ్బుల కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ముగియనున్న వేసవి సెలవులు

మరో మూడు రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఇప్పటికే ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు, కళాశాలలో అడ్మిషన్ల సందడి మొదలైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఖర్చుల ఆందోళన నెలకొంది. మండల, గ్రామీణ ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.15 నుంచి 50 వేల వరకు ఫీజును వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో పిల్లల చదువుల ఖర్చుల గురించి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.



భారీగా పెరిగిన ధరలు

ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాది పుస్తకాలు, దుస్తులు, నోట్‌పుస్తకాల ధరలు పెరిగాయి. 1 నుంచి 5వ తరగతివరకు ప్రైవేటు యాజమాన్యా లు వారికి ఇష్టమైన పుస్తకాలు బోధించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో వారు చెప్పిన పుస్తకాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఒక్కో యూనిఫామ్ ధర పదిహేను వందలకు అమ్ముతున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్, శనివారం మరో ప్రత్యేకమైన డ్రెస్‌ను కలిపి అమ్ముతున్నారు స్కూల్ బ్యాగు, బూట్లు కూడా రూ.ఐదు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు ఉంది. తరగతులను బట్టి రూ.3 వేల నుంచి 5 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇలా సగటున ఒక్కో విద్యార్థికి మొత్తం రూ.15 వేల నుంచి రూ.30 వేల దాక ఖర్చు అవుతోంది.

రైతులపై సాగు భారం

జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ మొదలవుతుంది. దీంతో పంటల సాగుకు రైతులు సిద్ధమతారు. దుక్కులు దున్నుకోవడం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వాటికి జూన్ నెలలోనే అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కో రైతు సాగు విస్తీర్ణం బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంది. అదే చదువుకొనే పిల్లలు ఉన్న రైతులకైతే వ్యవసాయానికి, పిల్లల చదువుకు రెండు రకాల ఖర్చులు వస్తాయి. దీంతో రైతులు అప్పులతో పరిస్థితులను నెట్టుకొస్తున్నారు. పంట పండితే సరి లేకుంటే అన్నదాతలు మరిన్ని అప్పుల్లో కూరుకుపోవడం తథ్యం. ఉద్యోగులకు కూడా సాధారణంగా జూన్ నెలలోనే బదిలీలు ఉంటాయి. బదిలీ జరిగితే ఆ ఊర్లో ఉన్న పాఠశాలకు అనుగుణంగా అన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పనే.



దడ పుడుతోంది



జూన్ నెల వచ్చిందంటే దడ పుడుతోంది. ఈ నెలలోనే అన్ని సమస్యలు ఉంటాయి. పిల్లల చదువులు, పంటలను సాగు చేసుకోవడం, వాటికి పెట్టుబడులు ఇలా అన్ని ఈ నెలలోనే రావడంతో టెన్షన్‌గా ఉంటుంది. ప్రతి పని అత్యవసరమే. ఏ పని నిర్లక్ష్యం చేయడానికి లేదు. చేతిలో డబ్బులు ఉన్నా లేకున్నా పూర్తి చేసుకోవాల్సి ఉంది.

- సోమశేఖర్, రైతు, కోట్లోపల్లి, చిలమత్తూరు మండలం

అన్ని సమస్యలు ఈ నెలలోనే..



జూన్ నెలలోనే అన్ని సమస్యలు వస్తాయి. అన్ని డబ్బుతో కూడుకున్నవే. ఒక పక్క పంటలను సాగుచేసుకోవడానికి, పిల్లలను స్కూళ్లకు పంపడానికి చాలినంత డబ్బులు ఉండాలి. దానికి తోడు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను కూడా ఈ జూన్ నెలలోనే రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో జూన్ నెల అంటేనే భయం భయంగా ఉంటోంది.

- వెంకటేశులు, మధురేపల్లి, చిలమత్తూరు మండలం

అధిక ఫీజులపై చర్యలు: కిష్టప్ప, డీఈఓ

జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు, కళాశాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే ప్రైవేటు, కార్పొరేటు కళాశాలలు, స్కూళ్ల ఫీజులు తీసుకోవాలి. అధికంగా వసూలు చేస్తే ఆ విద్యాసంస్థల అనుమతులు రద్దుచేస్తాం.

దోషులను కఠినంగా శిక్షించాలి

(5వ పేజీ తరువాయి)

సంఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని అన్నారు.



మాట్లాడుతున్న నిజనిర్ధారణ కమిటీ నాయకులు


● బాలికపై అత్యాచారం చేసినవారిని కఠినంగా శిక్షించాలని నిజ నిర్ధారణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీలో వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు శనివారం సమావేశాన్ని నిర్వహించారు. బాధితురాలి స్వగ్రామాన్ని సందర్శించాలని తీర్మానించారు. దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలపై సమగ్రమైన విచారణ చేపట్టి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, సాకే హరి, శ్రీరాములు, రామకృష్ణ, శంకర్, ఓబులేసు, ఆనంద్, సుగమంచి శ్రీనివాసులు, రామన్న, కేవీ రాజు, కదిరప్ప, దావీదు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ ఐద్వా, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా క్లాక్ టవర్ కూడలి వద్ద శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 6 నెలలుగా బాలికపై ఏకంగా 14 మంది పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత దళిత బాలికకు తండ్రి లేరని, తల్లి మానసిక పరిస్థితి సరిగా లేదని అన్నారు. ఇదే అదునుగా దుర్మార్గులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారని అన్నారు. బాలిక కుటుంబానికి నిందితుల మద్దతుదారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని, గ్రామం వదిలి వెళ్లాలని భయపెడుతున్నట్లు తెలిసిందని అన్నారు. మహిళా మంత్రి, మహిళా ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ఇలాంటి ఉదంతం ఆందోళనకరమని అన్నారు. కేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని, బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, ఐద్వా నాయకురాలు చంద్రిక, అశ్విని, గీత, కేవీపీఎస్ నాయకులు అక్కులప్ప, రాజా, డేవిడ్, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు జయవర్ధన్, సోము తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ రాకుండా వాదిస్తాం

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నరరూప రాక్షసులకు బెయిల్ రాకుండా బాధితుల తరపున కోర్టులో వాదిస్తామని బహుజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప అన్నారు. జిల్లా అధ్యక్షులు మహేశ్వరితో కలిసి శనివారం ప్రకటన విడుదల చేశారు. బాలికపై అత్యాచారాన్ని బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. బాధితుల తరపున ఇంప్లీడ్ అవుతామని, దోషులకు జీవిత ఖైదు పడేదాకా బాధ్యత తీసుకుంటామని తెలిపారు.

రీసర్వే తప్పిదాలు..!



ఓబిరెడ్డి పేరున ఉన్న పాత పట్టాదారు పుస్తకం

ఒకరి భూమి.. మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లోకి..
పాసుపుస్తకం కూడా జారీ..
అందులోనూ చిత్రవిచిత్రాలు
ఆంగ్లంలో ఒకలా.. తెలుగులో మరోలా..
సర్పంచ్ పదేపదే ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాని సమస్య

శింగనమల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చేపట్టిన భూముల రీసర్వే తప్పుల తడకగా సాగిందనడానికి మండలంలోని పెద్దజలాలపురం గ్రామానికి చెందిన భూస్వామి తరిమెల ఓబిరెడ్డి ఘటనే నిదర్శనం. తరిమెల ఓబిరెడ్డికి జూలాకాలువ రెవెన్యూ పొలం పరిధి 263-1, 183, 176-1, 176-2 సర్వే నంబర్లులో 40 ఎకరాల భూమి ఉంది. 2023లో ఈ రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వే చేపట్టారు. ఓబిరెడ్డికి ఉన్న 40 ఎకరాల్లో 20 ఎకరాలను మరొకరి పేరుపై నమోదు చేశారు. ఓబిరెడ్డికి సంబంధిచిన భూహక్కు పత్రంలో వేరొకరి ఆధార్ నంబరు నమోదు చేశారు. ఆ మేరకు పాసుపుస్తకం కూడా మరొకరి ఫొటోతో జారీ చేశారు. అలానే ఆన్‌లైన్ చేశారు. ఓబిరెడ్డి భూమికి ఓ ముస్లిం పేరుతో పాసు పుస్తకం ఇచ్చారు. విచిత్రమేమిటంటే ఆ ముస్లిం ఎవరో కూడా తెలీదు. ఆ ఊరు కాదు.. ఆ ప్రాంతమూ కాదు. అయినా.. ఎలా నమోదు చేశారో అధికారులే చెప్పాలి. పాసు పుస్తకంలో కూడా ఇష్టారాజ్యంగా చేశారు. ఇంగ్లీష్‌లో నమోదైన పాసుపుస్తంలో ముస్లిం తండ్రి పేరు ఓబిలేసు అని ఉంది. తెలుగులో ఉన్న చోట ఓబిరెడ్డి తండ్రి ఓబిలేసు అని నమోదు చేశారు. ఒక్కో చోట.. ఒక్కోలా నమోదు చేయడంతో అందరూ అవాక్కవుతున్నారు. ఓబిరెడ్డి కూమారుడు, జూలాకాలువ సర్పంచ్ తరిమెల రాజామోహన్‌రెడ్డి అప్పట్నుంచి సమస్య పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రీసర్వే ఆప్షన్ వచ్చిన తరువాత సరిచేస్తామని చెబుతున్నారు. రాజామోహన్ రెడ్డి రెండేళ్లుగా తిరుగుతున్నా.. సవరించిన పాపానపోలేదు. ఇదే విషయమై ఈనెల 4వ తేదీన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ అధికారులను ఆయన నిలదీశారు. సమస్య ఎప్పుడు పరిష్కారం ఆవుతుందో తెలియడం లేదని ఆయన వాపోయారు. గ్రామ సర్పంచ్ పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. పరిష్కరించలేదంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. భూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో చేసిన రీసర్వే కొత్త సమస్యలు తెచ్చిపెట్టిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రీసర్వే తరువాత ఆధార్ నంబరు, ఫొటో తప్పుగా ముద్రించిన పాసు పుస్తకం



తెలుగులో భూహక్కు పుస్తకంలో పేరు కరెక్ట్ ఫొటో ఆధార్ తప్పుగా ఉన్న పుస్తకం

సమస్య పరిష్కరిస్తాం

ఓబిరెడ్డి పొలానికి సంబంధించిన సమస్య మా దృష్టి కొచ్చింది. ప్రస్తుతం రీసర్వే తప్పిదాలను సవరించేందుకు ఆప్షన్ ఇచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.

- ప్రకాశ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్, శింగనమల

ఇరువర్గాల ఘర్షణ

కొత్తచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థలం వివాదం కారణంగా కొత్తచెరువులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ తెలిపారు. అనంతపురం సుశీలమ్మ, వైసీపీ నేత దాల్‌మిల్ సూరి మధ్య స్థల వివాదం ఉందని తెలిపారు. సుశీలమ్మ తన వర్గీయులతో కలిసి ఆ స్థలానికి కంచె వేస్తుండగా దాల్‌మిల్ సూరి అనుచరులు అడ్డుకున్నారని తెలిపారు. దీంతో గొడవ ముదిరి, పరస్పరం రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారని తెలిపారు. ఈ దాడిలో సుశీలమ్మ వర్గీయులు ఇద్దరు, దాల్‌మిల్ సూరి వర్గీయులు ఇద్దరు గాయపడ్డారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నీటికుంటుపడుతున్నాయ్..!

● కూడేరు మండలానికి లక్ష్యం 66..
● ఇప్పటి వరకు 8 మాత్రమే పూర్తి
● కూలీలు రాక, సిబ్బంది లేక జాప్యం

నత్తనడకన నీటికుంటల తవ్వకం





↑ నీటి కుంటను తవ్విన కూలీలు, నీటికుంట కొలతలు వేస్తున్న ఉపాధి సిబ్బంది →

కూడేరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వర్షం నీటిని ఒడిసిపట్టి, భూగర్భ జలాలు పెంపొందించే ఉద్దేశంతో చేపట్టిన నీటి కుంటల తవ్వకం లక్ష్యానికి దూరంగా ఉండిపోయింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో నీటి కుంటల పనులను కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 578 గ్రామ పంచాయతీల్లో మొదటి రోజున 2,300 పనులు ప్రారంభమయ్యాయి. జూన్ నాటికి 9 వేల నీటికుంటల పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా కూడేరు మండలంలో 66 నీటి కుంటలు తవ్వాలని లక్ష్యంగా విధించారు. 8 మాత్రమే ఇప్పటి వరకు పూర్తిచేశారు. మరో 28 పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 30 నీటికుంటల పనులు ప్రారంభం కాలేదు.

వర్షపు నీరు వృథా

ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురిశాయి. నీటికుంటల పనులు పూర్తికాకపోవడంతో వర్షం నీరు వృథాగా వంకలపాలవుతోంది. ఉపాధి కూలీలు సక్రమంగా పనులకు రాకపోవడంతోపాటు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో కూలీల కొరత తీవ్రమవడంతో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి కాలేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. మండలంలోని కొర్రకోడు, గొట్కూరు గ్రామ పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పనులు సక్రమంగా సాగడంలేదు. దీంతో నీటికుంటల పనులు లక్ష్యాన్ని అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు.

గడువులోగా పూర్తి చేస్తాం: పోలేరయ్య, ఏపీఓ, కూడేరు



మండలానికి ఇచ్చిన నీటి కుంటల లక్ష్యం జూన్ నాటికి పూర్తిచేస్తాం. గ్రామాల్లో ఉపాధి పనికి కూలీలు సక్రమంగా రావట్లేదు. దీంతో పనులు వేగంగా సాగడం లేదు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడం కూడా ఆలస్యానికి కారణం. గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి, పనులకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం విధించిన గడువులోపు పనులు పూర్తి చేసి, వర్షం నీటిని వృథా కాకుండా కాపాడతాం.

క్షీరం.. గరళం..!

(5వ పేజీ తరువాయి)

అమ్మి సొమ్ముచేసుకుంటున్నారే తప్ప నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు.

కవర్లలో నిల్వతో జబ్బుల ముప్పు

పాలను ప్యాకెట్లలో నింపే క్రమంలో సరైన కవర్లు వాడకపోతే అనేక అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. నాసిరకం ప్లాస్టిక్ కవర్లలో పాలు నింపి సరఫరా చేయడానికి కొద్దిరోజులు సమయం పడుతుంది. దీనివలన కవర్లలోని విషపదార్థాలు పాలలో కలిసి మరింత ప్రమాదంగా మారుతున్నాయి. ఇలాంటి పాలను వాడటం వలన అన్నిరకాల క్యాన్సర్ వ్యాధులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, కిడ్నీలు, ఎముకల బలహీనత, కాలేయం దెబ్బతినడం వంటి జబ్బులు వస్తాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ప్యాకెట్ పాలను డీప్ ఫ్రిడ్జ్‌లో నిల్వ చేయాలి. అలా చేయకపోతే ఆ పాలు విషతుల్యం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. మరి జిల్లా వ్యాప్తంగా ఎంతమంది డీప్ ఫ్రిడ్జ్‌లో ఉంచి పాల ప్యాకెట్లు విక్రయిస్తున్నారో దేవుడికెరుక. పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి వచ్చే పాల ప్యాకెట్లలో కూడా కల్తీ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిద్రమత్తు వీడని ఆహారకల్తీ నిరోధకశాఖ

పాలలో ఇంత కల్తీ జరుగుతున్నా, మేధావులు గగ్గోలుపెడుతున్నా ఆహారకల్తీ నిరోధకశాఖ మాత్రం నిద్రావస్థను వీడటం లేదు. జిల్లా పాలకల్తీ వ్యవహారం జోరుగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

ఆహారకల్తీ నిరోధకశాఖ అధికారులు నిద్రమత్తువీడి పాలకల్తీపై దాడులు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

గట్టి చర్యలు తీసుకోవాలి



ఇటీవల కాలంలో కల్తీ పాలు వస్తున్నాయని పేపర్లలో చదువుతున్నాము. దీంతో భయం వేస్తోంది. పాలను కల్తీచేసేవారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం మార్కెట్లో పాలవ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. ఎక్కడా చూసినా ప్యాకెట్లద్వారా పాలను తీసుకెళుతున్నారు. పాడి రైతులకు ధర తక్కువ ఇచ్చి మార్కెట్లో మాత్రం ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు. అవికూడా కల్తీ వస్తున్నాయంటే ఆందోళనగా ఉంది.

- కొంకా గంగాద్రి, వసంతపురం, ధర్మవరం రూరల్ మండలం

ఏవి మంచిపాలో...?



మా సందులో కల్తీ గురించి అందరూ మాట్లాడుకుంటుంటే పాలను కొనుక్కోవాలంటేనే భయమేస్తోంది. ఏవి మంచివో ఏవీ కల్తీవో తెలుసుకోలేకపోతున్నా. ప్యాకెట్ పాలైతే రుచి పచీ లేకుండా ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారులు కూడా కల్తీ చేస్తారంట. అధికారులు వాళ్లను పట్టుకొని జైలుకు పంపించాలి.

- మంగమ్మ, కొత్తచెరువు

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



జిల్లా వ్యాప్తంగా పాల కల్తీపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ధర్మవరం, కళ్యాణదుర్గం, యాడికి, తాడిపత్రి, కొత్తచెరువు, కదిరి ప్రాంతాల్లో పాల తనిఖీలు నిర్వహించాం. శాంపిల్ తీసి, పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపాం. పాలలో కల్తీ ఉన్నట్లు తేలితే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తాం.

- రామచంద్ర, జిల్లా ఆహారభద్రతాధికారి



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

కల్తీ, అపరిశుభ్రతతో కూడిన పాలను వినియోగించిన వారు తీవ్ర అనారోగ్యానికి గురికాక తప్పదు. కల్తీ పాలను తాగితే టైఫాయిడ్, పేగులకు టీబీ, అజీర్ణం, చెడుకొవ్వు పేరుకుపోవడం వంటి రోగాలతోపాటు క్యాన్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. అలాగే కిడ్నీలు పాడైపోవడం, కాలేయ సంబంధిత వ్యాధులు, ఎములకల బలహీనత వంటి జబ్బులు వచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ సునీల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సహకారం.. అస్తవ్యస్తం..!

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. ఆయన కొడుకుకు తనకల్లు బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా నియామకంతో పాటు సుమారు రూ.50 లక్షలు బెనిఫిట్స్ కూడా ఇచ్చారు. వీఆర్ఎస్ సమయంలో తనకు బెనిఫిట్స్ అవసరం లేదు, తన కొడుకుకి ఉద్యోగం ఇస్తే చాలని రాతపూర్వకంగా లేఖ ఇచ్చినా.. అప్పటి ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. 2008లో కళ్యాణదుర్గం బ్రాంచ్‌లో పనిచేసిన ఓ మేనేజర్ రూ.40 లక్షలు బినామీ పేర్లతో రుణాలు ఇచ్చినట్లు తేల్చారు. 2023 వైసీపీ హయాంలో ఆ ఉద్యోగితో ముడుపులు తీసుకుని క్లీన్ చీట్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022లో కనగానపల్లి సొసైటీలో డబుల్ లోన్ తీసుకున్న ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఏడాది తిరగకుండానే ముడుపులతో తిరిగి ఉద్యోగం ఇచ్చి మడకశిర ప్రాంతానికి బదిలీ చేశారు. ఆత్మకూరులో బినామీ పేర్లతో 11 మందికి రూ.40లక్షలకు పైగా రుణాలు ఇచ్చినట్లు తేలినా.. విచారణ పేరుతో అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రైతులకు సొసైటీల ద్వారా వచ్చే వడ్డీ రాయితీ సుమారు రూ.3 కోట్ల వరకు ఏడీసీసీ బ్యాంకు అధికారులు వైసీపీ ప్రభుత్వంలో మెక్కేశారు. ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలకు స్టేషనరీ, క్యాలెండర్లు, డైరీలతో పాటు కంప్యూటర్ పరికరాలు ఎలాంటి టెండర్లు లేకుండా నగరంలోని కమలానగర్‌లో ఉన్న బినామీకి ఇచ్చి లక్షలు కొల్లగొట్టారు. కొందరు ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కొన్నేళ్లుగా పాతుకుపోవడంతో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడీసీసీ బ్యాంకులో పేరుకుపోయిన సమస్యలపై కొత్త చైర్మన్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డీసీఎంఎస్ స్థలాల ఆక్రమణ

వైసీపీ ప్రభుత్వంలో నగరంలోని ప్రభుత్వరంగ సంస్థ అయిన డీసీఎంఎస్ (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) స్థలానికి పట్టా ఇచ్చారు. మూడేళ్ల క్రితం అనంతపురం రూరల్ తహసీల్దార్ అధికారపార్టీ ప్రజాప్రతినిధి అండతో పట్టా సృష్టించారు. ఒక్కొక్కరితో రూ.5లక్షలు తీసుకుని గుత్తిరోడ్డులోని డీసీఎంఎస్ స్థలంలో ముగ్గురుకి పట్టాలు ఇచ్చారు. ఇదే అదనుగా రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొట్టేయాలని ఆక్రమణదారులు కన్నేశారు. డీసీఎంఎస్ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. పలుమార్లు సహకార శాఖ అధికారులు విచారణ పేరుతో అక్కడికి వెళ్లి అందినకాడికి దండుకుని వెనక్కు వస్తున్నట్లు సమాచారం. డీసీఎంఎస్‌కు చెందిన 2.28 ఎకరాల స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లే దారిలో రూ.కోట్ల విలువ చేసే స్థలం ఉంది. ఇందులో గోడౌన్లు, హోటళ్లు, ఇతరత్రా వాటికి ఎలాంటి టెండర్లు లేకుండా అద్దెకు ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన స్థలాన్ని వైసీపీ ఐదేళ్ల కాలంలో సుమారు అర ఎకరం వరకు ఆక్రమించుకున్నారని పలువురు అధికారులే చెబుతున్నారు. నగర నడిబొడ్డున కమలానగర్‌లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఎలాంటి టెండర్లు, అగ్రిమెంట్లు లేకుండానే ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చేశారు. అసలు ఎన్నేళ్ళు లీజు, ఎంత కాలం అద్దె తెలియకుండానే వ్యవహారం నడుపుతున్నారు. డీసీఎంఎస్ అధికారులు, సిబ్బందిపైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన స్థలంలో కనీసం అగ్రిమెంట్లు లేకుండా లీజు, అద్దెకు ఇస్తుండడమే భూ ఆక్రమణలకు కారణమవుతోందని తెలుస్తోంది. కొత్తగా వచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆక్రమణలకు గురవుతున్న డీసీఎంఎస్ స్థలం

రేపు విద్యార్థులకు పురస్కారాలు

● షైనింగ్‌స్టార్స్‌ను విజయవంతం చేయండి ● 180 మంది టెన్త్, 35 మంది ఇంటర్ విద్యార్థులకు సత్కారం ● అధికారులతో కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం కోసం సోమవారం షైనింగ్‌స్టార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. షైనింగ్‌స్టార్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 180 మంది పదో తరగతి, 35 మంది ఇంటర్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేలు నగదు అందించి సత్కరిస్తామని పేర్కొన్నారు. ఇందుకు అనుకూలమైన వేదిక గుర్తించి ఎక్కడా లోటుపాట్లు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం శిల్పారామంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఈనెల 12వతేదీ నాటికి ప్రభుత్వ పాలనకు ఏడాది కాబోతున్న నేపథ్యంలో జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రధానంగా పీఆర్ ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు మౌలిక సదుపాయాల ప్రారంభోత్సవాలపై దృష్టి సారించాలని తెలిపారు. మంజూరైన యూనిట్ల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఈనెల 12న ఏడాది పాలన నేపథ్యంలో అమరావతిలో రాత్రి 8-30 గంటలకు ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని, దీనిపైనా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

మత్తుగా.. గమ్మత్తుగా..!



ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపై శనివారం ఉదయం 7 గంటలకే ఇద్దరు యువకులు హల్‌చల్ చేశారు. వారు మద్యం సేవించి రోడ్డుపై పడి దొర్లుతూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగించారు. వాహనదారులు, ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అనంతరం స్థానికులు మందలించి యువకులను అక్కడి నుంచి పంపించేశారు.

యువకుల ఘర్షణ.. ఒకరి మృతి



యశ్వంత్‌కుమార్ (ఫైల్)

గార్లదిన్నె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పెనకచెర్లలో ఇద్దరు యువకుల మధ్య కొన్నాళ్లుగా జరుగుతున్న ఘర్షణ కారణంగా ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు చితంబరయ్య కుమారుడు యశ్వంత్‌కుమార్ (16), రామాంజినేయులు కుమారుడు దివాకర్ చితంబరప్ప స్వామి తిరునాళ్లల్లో గొడవపడ్డారు. యశ్వంత్ దాడిలో తీవ్రంగా గాయపడిన దివాకర్ కోమాలోకి వెళ్లాడు. చికిత్స అనంతరం కోలుకుని ఇటీవల ఇంటికి వచ్చాడు. తనపై దాడిచేసిన యశ్వంత్‌పై కోపం పెంచుకున్నాడు. అతనిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచాలని అనుకున్నాడు. శనివారం ఉదయం యశ్వంత్‌తో గొడవకు దిగాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపారు. యశ్వంత్‌కుమార్ గొర్రెలను మేపేందుకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి వెళుతుండగా, దివాకర్ కర్రతో బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య గ్రామానికి వెళ్లి విచారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కట్నం కేసు నమోదు

యాడికి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కట్నం కోసం వేధిస్తున్నారని ఐశ్వర్య అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త విష్ణువర్ధన్, మామ కుళ్లాయప్పపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటరమణయ్య శనివారం తెలిపారు. చందన గ్రామానికి చెందిన ఐశ్వర్య నార్పల మండలం కేశేపల్లికి చెందిన సమీప బంధువు విష్ణువర్ధన్‌ను ఇష్టపడి ఏడాది క్రితం పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల తరువాత కట్నం కోసం భర్త, మామ వేధిస్తున్నారని ఐశ్వర్య ఫిర్యాదు చేశారు.

కామర్స్ లెక్చరర్ మృతి



హబీబుద్దీన్(ఫైల్)

అనంతపురం సెంట్రల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలపాటు విద్యార్థులకు పాఠాలు బోధించిన సీనియర్ లెక్చరర్ సిద్దవటం హబీబుద్దీన్(62) మృతిచెందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. హబీబుద్దీన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని పాతూరుకి చెందిన హబీబుద్దీన్.. ఎస్కేయూలో ఎంకాం పూర్తిచేశారు. బోధనావృత్తిని ఎంచుకుని 40ఏళ్లుగా వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో కామర్స్ పాఠాలు చెబుతూవచ్చారు. శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదరరెడ్డి అధ్యక్షతన హబీబుద్దీన్ మృతికి సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

పాతకక్షలతో దాడి



ధ్వంసమైన వాహనం

తాడిపత్రి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న జిలాన్‌బాషా ఇంటిపై దాడిచేసి అతడి భార్య షేకున్, కుమారుడు మస్తాన్, కూతురు అర్షిపై దాడిచేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. జిలాన్‌బాషా మెకానిక్ పనులు చేసేవాడు. కొంతకాలం క్రితం ఇంటి సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో షఫీ, రహంతుల్లా, బాబావలి, షంషూర్ మద్యం సేవించేవారు. అప్పట్లో వారిని మందలించి పోలీసులకు పట్టించారనే కోపంతో శనివారం మద్యం మత్తులో ఇంటిలోకి దూరి వారిని చితకబాది షేకున్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచారు. ఇంటిలోని వస్తువులను చిందరవందర చేసి చంపుతామంటూ బెదిరించారు. అసభ్యంగా ప్రవర్తించారని షేకున్‌బీ వాపోయారు. ద్విచక్రవాహనాన్ని, కారును ధ్వంసంచేసి పారిపోయారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోకు రూ.11,200 జరిమానా



జరిమానా వేసింది ఈ ఆటోకే

అనంతపురం క్రైం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు కుక్కి తీసుకువెళుతున్న ఆటోకు నాలుగో పట్టణ పోలీసులు రూ.11,210 జరిమానా విధించారు. నారాయణపురంలో సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఓ ఆటోకు కాంక్రీట్ మిల్లర్ తగిలించి, 15 మంది కూలీలను తీసుకువస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవడంతో ఆర్టీఏ అధికారులకు సిఫార్సు చేశారు. వారు రూ.11,200 జరిమానా వేశారు.

బదిలీల పంచాయితీ..?

గ్రేడ్-4 కార్యదర్శులకు తప్పని నిరాశ

గ్రేడ్-4 అడిషినల్ పేరుతో గ్రేడ్-5కు అందలం

లబోదిబోమంటున్న గ్రేడ్-4 కార్యదర్శులు



డీపీఓ కార్యాలయం (ఫైల్ ఫొటో)

అనంతపురం న్యూటౌన్ జూన్ 7(ఆంధ్రజ్యోతి) బదిలీల్లో భాగంగా జిల్లాలోని గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులకు మొండి చేయి చూపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేడ్-4 కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించకుండానే గ్రేడ్-5 కార్యదర్శుల్లో కొందరికి గ్రేడ్-4 అడిషినల్ కింద బదిలీ చేశారు. దీంతో ఆ స్థానంలో వెళ్లాలని వేచి చూస్తున్న అర్హులైన గ్రేడ్-4 కార్యదర్శులకు నిరాశ మిగిలింది. లేని గ్రేడ్స్‌ను సృష్టించి లేనిపోని సమస్యలు తెచ్చిపెడుతున్నారని పలువురు అర్హులైన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిషినల్ గ్రేడ్-4 ఎక్కడ నుంచి వచ్చింది?

పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రేడ్-4 అడిషినల్ అనే గ్రేడ్ లేదు. గత ప్రభుత్వం మాటమాత్రంగా చెప్పిందే కానీ ఉత్తర్వులు ఇవ్వలేదు. అయితే గత ఏడాది సాధారణ బదిలీల్లో భాగంగా అప్పటి అధికారులు అప్పటి ప్రభుత్వ పెద్దల మెప్పు పొందడానికి గ్రేడ్-4 అడిషినల్ కింద స్థానిక నాయకులు సూచనల మేరకు వారు చెప్పిన వారిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారు. ఆ బదిలీ స్థానాల్లో వీరికి తగిన అర్హత లేదన్న ఉద్దేశంతో అక్కడ పొజిషన్ ఐడీలు లేక వేతనం తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇలా ఉమ్మడి జిల్లాలో 96 మంది ఇబ్బంది పడ్డారు. వీరిలో 33 మంది వారికి ఉన్న పరిచయాలతో ఉన్నతాధికారులను మెప్పించి పొజిషన్ ఐడీలు తెచ్చుకుని, వేతనం తీసుకోగలిగారు. ఇదే తరహాలో మిగిలిన వారికి కూడా వేతనం మంజూరు అయ్యేలా చూడాలని ఉన్నత అధికారులు ఎందుకు చెప్పలేకపోయారన్నది ప్రశ్నార్థకరంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం సాధారణ బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసే వరకు కూడా ఉన్నతాధికారులు తమకేం పట్టదన్నట్లు వ్యవహరించారు. ఉత్తర్వులు రాగానే సమస్యను పరిష్కరించకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని బదిలీల కంటే ముందుగానే ఖాళీ స్థానాల్లో గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులను బదిలీ చేశారు. ఆమేరకు గెజిట్ విడుదల చేసి కలెక్టర్ ఆమోదంతో పంచాయతీరాజ్ కమిషనర్ ఆమోదానికి పంపారు. దీంతో ఆ స్థానంలో గ్రేడ్-4 కార్యదర్శులుగా బదిలీపై వెళ్లాలనుకొనేవారికి అవకాశం లేకుండా చేశారు. గ్రేడ్-4 అడిషినల్ వారిని బదిలీ చేసిన తరువాత 20 మంది గ్రేడ్-4 కార్యదర్శులకు మాత్రమే బదిలీలు చేశారు.

చట్టంలోనే లేదు..

అడిషినల్ గ్రేడ్-4 అన్నది పంచాయితీరాజ్ చట్టంలోనే లేదు. లేని గ్రేడ్ ను అధికారులు ఎందుకు అమలు చేస్తున్నారన్నది అర్థం కాని ప్రశ్న. కూటమి ప్రభుత్వం చట్ట సవరణలో భాగంగా గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకే పంచాయతీలను అమలు చేస్తోంది. అంటే వైసీపీ ప్రభుత్వంలో సచివాలయంలో నియమితులైన గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులు పంచాయతీలకు నియమించడానికి వీలు లేదు. అయితే అధికారులు అత్యుత్సాహంతో గ్రేడ్-5 కార్యదర్శులను అడిషినల్ గ్రేడ్-4 పేరుతో గ్రేడ్-4 కార్యదర్శుల స్థానంలో నియమిస్తుండటంతో సమస్యలు తలెత్తుతు న్నాయి. దీనిపై యూనియన్ తరఫున గ్రేడ్-4 కార్యదర్శులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

ముమ్మాటికీ దేవతల రాజధానే..!

మాజీ మేయర్ స్వరూప



అనంతపురం అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే అని, భూములను త్యాగాలు చేసిన అమ్మల రాజధాని అని మాజీ మేయర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు స్వరూప అన్నారు. నగరంలోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్ అనే సైతాన్‌ను తరిమేసిన అన్ని మతాల దేవతలు, దేవుళ్లు కొలువైన రాజధాని అమరావతి అని అన్నారు. కన్నతల్లిని, సొంత చెల్లిని తరిమేసిన జగన్‌కు మహిళల త్యాగాలు, గొప్పతనం గురించి ఎలా తెలుస్తుందని విమర్శించారు. మహిళలంటే గౌరవం లేని జగన్ రెడ్డిని చూసి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మహిళలకు తక్షణమే జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు ముసుగులో ఉన్న పేటీఎం కృష్ణం రాజు, కొమ్మినేని శ్రీనివాస్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరావతిపై విషం కక్కుతారా..?

ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిగా ఉండటం వైసీపీ నాయకులకు మొదటి నుంచి ఇష్టం లేదని, అందుకే ఏదో విధంగా విషం కక్కుతూనే ఉన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వం, సీఎం చంద్రబాబు గురించి నేరుగా మాట్లాడితే సమాధానం ఇస్తామని, ఇలా అమరావతిపై విషం చిమ్మడం సిగ్గు చేటని అన్నారు. అమరావతి వేశ్యల రాజధాని అనడం మహిళలను కించపరచడమే అని అన్నారు. 'మీ మీడియాతో ఇంత ఘోరంగా మహిళలను అవమానపర్చవచ్చా?' అని జగన్‌ను నిలదీశారు. ఇలాంటి ప్రచారాలు చేస్తున్న వారి ఇళ్లలో మహిళలు ఉన్నారా లేదా అనే అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను త్యాగాలు చేసిన అమ్మల రాజధాని అమరావతి అని, ముమ్మాటికీ దేవతల రాజధానే అని అన్నారు. మహిళలను అవమాపరిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వైసీపీ నాయకులు మహిళలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కూలీల వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

ఒకరి మృతి.. 27 మందికి గాయాలు



కూలీల బొలెరో వాహనాన్ని ఢీ కొట్టిన లారీ



మృతి చెందిన గంగమ్మ



గాయపడిన కూలీలు

గార్లదిన్నె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, 27 మంది గాయపడ్డారు. చీనీ తోటలో పనులు ముగించుకున్న కూలీలు.. బొలెరోలో తిరిగి వెళుతుండగా లారీ ఢీ కొట్టింది. దీంతో కల్లూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గంగమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందారు. గార్లదిన్నె మండల కల్లూరు, ఎగువపల్లి గ్రామాలకు చెందిన శివమ్మ, పుల్లమ్మ, నాగలక్ష్మి, దేవమ్మ, చిన్న పుల్లక్క, దేవక్క, పార్వతమ్మ, పెద్ద అమ్ములు, నాగేంద్ర, నాగజ్యోతి, మణికంఠ, ఈరమ్మ, బాలచిన్న పుల్లమ్మ, తిప్పమ్మ సహా 27 మంది గాయపడ్డారు. వీరిలో బాలచిన్న పుల్లమ్మ, నాగలక్ష్మి, మల్లేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. కూలీలు ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చీనీ పండ్లు కోసేందుకు వెళ్లారు. వీరి వాహనం తిమ్మంపేట వద్దకు రాగానే అనంతపురం వైపు నుంచి గుత్తి వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో బొలెరో రోడ్డుపై పల్టీలు కొట్టింది. లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో బొలెరోకు ప్రమాదం జరిగిందని కొందరు అంటున్నారు. ప్రమాదానికి కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం 108 వాహనాల ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. వాహనంలో 35 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం.

వెబ్ కౌన్సెలింగ్ వద్దే వద్దు..!

● మాన్యువల్‌గా నిర్వహించాలి ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ ● ఎస్‌జీటీ బదిలీలపై వివాదం



వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెకెండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని మెజార్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వెబ్ కౌన్సిలింగ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు వారు ప్రకటించారు. షెడ్యూల్ మేరకు శనివారం నుంచి 10వ తేదీ వరకూ ఎస్‌జీటీలు బదిలీలకు వెబ్ ఆప్షన్లు పెట్టాలి. అయితే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ కమిషనర్ గతంలో తమకు మాట ఇచ్చారని, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని సంఘాల నేతలకు విమర్శిస్తున్నారు. అన్ని మండల వనరుల కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. టీచర్లు వెబ్ ఆప్షన్లు పెట్టుకోడానికి వీలుగా మండల వనరుల కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. జిల్లా విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఆ దిశగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమౌతున్నారు.

వ్యతిరేకిస్తున్న సంఘాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,626 మంది ఎస్‌జీటీలు బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరిలో 3,085 మంది తప్పనిసరి, 1,541 మంది రిక్వెస్టు బదిలీ జాబితాలో ఉన్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇస్తే.. 11వ తేదీన బదిలీల ఉత్తర్వులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు భావించారు. షెడ్యూల్ మేరకు గడువులోగా పూర్తి చేయాలనే తలంపుతో పాఠశాల విద్యాశాఖ ముందుకెళుతోంది. సంఘాల నాయకులు మాత్రం గతంలో కమిషనర్ ఇచ్చిన మాట మేరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. వెబ్ కౌన్సెలింగ్ పెట్టరాదని డిమాండ్ చేస్తున్నారు. ఎవరూ ఆన్‌లైన్‌లో ఆప్షన్లు పెట్టవద్దని టీచర్లకు సూచించారు. ఈ వ్యవహారంలో సామాన్య టీచర్లు తటస్థంగా ఉంటున్నారు.

నేడు డీఈఓ ఆఫీస్ ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని ఐక్యవేదిక నాయకులు నాగిరెడ్డి, వెంకటరత్నం తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ జరుపుతామని మాట ఇచ్చి, వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారని విమర్శించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈఓ ఆఫీస్‌ను ముట్టడిస్తాంమని, ఐక్యవేదిక నాయకులు, టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి సవిత దురుసు ప్రవర్తన.. అవాస్తవం

● తహసీల్దార్ శ్రీధర్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పెనుకొండ టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపు ప్రారంభోత్సవంలో మంత్రి సవిత రెవెన్యూ అధికారులపై దురుసుగా వ్యవహరించారని చేస్తున్న ప్రచారం అవాస్తవమని పెనుకొండ తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వోలు తేజ, బషీర్, యశస్విని లతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1న ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రెండు ఎఫ్‌పీ షాపులు ప్రారంభోత్సవం జరిగాయన్నారు. మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చేతన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారన్నారు. ఈ క్రమంలో మంత్రి సవితకు సీఎస్‌డీటీ ప్రభావతి బొకేను అందించారన్నారు. మంత్రి బొకేను తీసుకొని తన వెనుక ఉన్న గన్‌మెన్‌కు అందించే క్రమంలో పుష్పగుచ్ఛం కిందకు జారిపడిందన్నారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసి మంత్రి దురుసు ప్రవర్తనంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి సవిత ఏడాది నుంచి అధికారులతో సౌమ్యంగా ఉన్నారని, ఎన్నడూ దురుసుగా ప్రవర్తించింది లేదన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సెకెండ్ ఇయర్‌లో 3,128, ఫస్ట్ ఇయర్‌లో 3,336 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొత్తం 6,464 మంది పాసయ్యారు. ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో 4,545 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3,128 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా వ్యాప్తంగా 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 7వ స్థానం దక్కింది. ఫస్ట్ ఇయర్‌లో 7,404 మంది హాజరుకాగా 3,336 మంది విద్యార్థులు పాసయ్యారు. 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో 14వ స్థానం దక్కింది. విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్‌కు రూ. 1300, రీ కౌంటింగ్‌కు రూ.260 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

చీనీ టన్ను రూ.32వేలు

అనంతపురం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32,240 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3,980, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 505టన్నుల చీనీకాయలు వచినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు

అనంతపురం న్యూటౌన్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి) సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శుల బదిలీలు శనివారం జరిగాయి. డీపీఓ నాగరాజనాయుడు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలో గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శులకు సంబంధించి ఐదేళ్లు ఒకే చోట పని చేసిన వారు, వివిధ కారణాలతో వినతులు పెట్టుకున్న వారికి సంబంధించి ఏడుగురిని బదిలీ చేశారు. గ్రేడ్-4కు సంబంధించి 20 మంది కార్యదర్శులను బదిలీ చేశారు. అలాగే ఉమ్మడి జిల్లా గ్రేడ్-4 అడిషినల్ కింద పొజిషన్ ఐడీ చూపించడంలో భాగంగా 60 మందినిబదిలీ చేశారు.

సెక్రటరీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
చంద్రశేఖర్	ఆత్మకూరు	కొనకొండ్ల
వెంకటేశ్వర ప్రసాద్	కొనకొండ్ల	కొరడికొండ
సాదిక్‌వలి	కొరడికొండ	ఆత్మకూరు
అశ్వత్థమనాయుడు	యాడికి	పామిడి
గోపాల్	పామిడి	యాడికి
చంద్రశేఖర్	గార్లదిన్నె	చెన్నేకొత్తపల్లి
ముత్యాలరెడ్డి	బత్తలపల్లి	గార్లదిన్నె

గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు

సెక్రటరీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మహబుబ్‌బాషా	ఆమిద్యాల	కసాపురం
మల్లికార్జున	ఊరిచింతల	కొర్రపాడు
మహమ్మద్ రఫీ	కుందిర్పి	జంతులూరు
రామాంజినేయులు	మర్తాడు	సిద్దరాంపురం
బాలరామమూర్తి	సజ్జలదిన్నె	చిన్నపొలమడ
లీలారాణి	శింగనమల	పొడరాళ్ల
ఖాదర్‌వలి	పెనకచర్ల	కే కే అగ్రహారం

సూపర్ స్పెషాలిటీకి నాలుగు పీజీ సీట్లు

అనంతపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మరో నాలుగు పీజీ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేసిందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శనివారం తెలిపారు. న్యూరో సర్జరీ విభాగానికి ఈ నాలుగు పీజీ సీట్లను మంజూరు చేశారని, ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్‌లు పొందడానికి అవకాశం కల్పించారని తెలిపారు. .పీడియాట్రిక్ సర్జరీ విభాగానికి నాలుగు పీజీ సీట్లు మంజూరు చేయాలని ఎన్ఎంసీని కోరామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. అనంత వైద్యకళాశాల ఏ గ్రేడ్‌కు చేరుకుందని, ఇది మరింత ఆనందకరమని అన్నారు.

అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం



తాళం వేయడంతో ఇంటి ముందు కూర్చున్న గంగమ్మ కుటుంబ సభ్యులు

హిందూపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చలేదని ఇంటికి తాళం వేసిన సంఘటన హిందూపురం మండలం గోళ్లాపురంలో శనివారం చోటుచేసుకుంది. దీనిపై బాధితురాలు గంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త హనుమప్పకు రూ.50 వేలు ఇచ్చామని అప్పలకుంటకు చెందిన అంజక్క, ఆమె కుమారుడు సుధాకర్ కొన్నాళ్ల నుంచి వేధిస్తున్నారని గంగమ్మ తెలిపారు. తన భర్త ఐదేళ్ల క్రితమే మృతి చెందాడని, ఇప్పుడు వచ్చి అప్పు అంటున్నారని, ఆధారాలను కూడా చూపడం లేదని వాపోయారు. డబ్బులు ఇవ్వలేదని తమను బయటకు గెంటేసి, ఇంటికి తాళం వేసుకున్నారని తెలిపారు. విచారించి న్యాయం చేస్తామని సీఐ ఆంజినేయులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్స్, రైళ్లలో ప్రయాణికుల బ్యాగ్‌లు, వెయింటింగ్ హాల్, పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ప్రతి విద్యార్థికి కిట్టు అందాలి

● నోడల్ ఆఫీసర్ సుబ్బారావు

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి విద్యార్థిమిత్ర కిట్టు అందేలా చూడాలని విద్యాశాఖ జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లాల నోడల్ ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలించారు. అనంతపురం ఏపీసీ శైలజతో కలసి అనంతపురం, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లోని స్టాక్‌పాయింట్లతోపాటు పలు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....ఈ నెల 12వ తేదీ విద్యార్థులకు అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నారాయణ స్వామి, వేణుగోపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అక్కదేవతల పరుష ప్రారంభం



అక్కదేవతల ఆభరణాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నల్లమాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దువాండ్లపల్లి సమీపంలోని ఊట్లలో అక్కదేవతల ఉట్ల పరుష శనివారం ప్రారంభమైంది. నల్లమాడలోని పూజారుల ఇంటి నుంచి అక్కదేవతల ఆభరణాల ను ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు గా తీసుకెళ్లారు. ఈ సంద ర్భంగా పూజారి కే మాట్లాడుతూ శనివారం దాసంగాలతో ప్రారంభమైనట్లు తెలిపారు. ఆదివారం విడిదినం, సోమవారం ఎలవ, మంగళావారం బండ్ల ఊరేగింపు, మంగళవారం కుంకుమ పరుష జరుగుతుందన్నారు. ఈ పరుషకు నల్లమాడ, కురమాల, మసకవంపల్లి గ్రామాల భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

కాంగ్రెస్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాటమయ్య



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కాటమయ్య

తాడిమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్మిక సంఘం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ తాడిమర్రి మండల మాజీ కన్వీనర్ కాటమయ్య నియమితులయ్యారు. కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట క్రిష్టారెడ్డి అధ్యక్షతన శుక్రవారం పుట్టపర్తిలో కమిటీని ఎంపికచేశారు. డీసీసీ అధ్యక్షుడు ఇనయ్‌తుల్లా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కాటమయ్య తెలిపారు. పార్టీ అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ నిషార్ అహమ్మద్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవ వీధి, లోనికోట, మార్కెట్‌వీధి, బడేసాబ్‌వీధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ పట్టణ ఏఈ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు తిరిగి రాలేదని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా, ఆ బాలుడు అదే కాలనీలోనే బంధువుల ఇంటో ఉన్నట్లు శనివారం సమాచారం వచ్చిందని తెలిపారు. అతడిని పిలుచుకుని వచ్చి సీఐ రెడ్డెప్ప అతడిని తండ్రికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బత్తలపల్లి /ఓబుళదేవరచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలాలపరిధిలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ సమీపంలోఉదయం ఎద్దుల బండిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వీరనారప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం రూరల్ మండలం గొట్లూరుకు చెందిన వీరనారప్ప వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజూ మాదిరిగానే వ్యవసాయ పనులపై ఎద్దులబండిని తోలుకుంటూ వేల్పుమడుగు గ్రామానికి వెళ్తున్నాడు. క్రాస్ సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరనారప్ప తీవ్రంగా గాయపడ్డాడు. రెండు ఎద్దులకు తీవ్ర గాయలయ్యాయి. బండి పూర్తిగా దెబ్బతింది. ఆ దారిలో వెళ్తున్న వాహనదారులు గమనించి వీరనారప్పను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే బత్తలపల్లి మండలం జ్వాలాపురం క్రాస్ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి ఒకరు గాయపడ్డారు. కడప పట్టణానికి చెందిన శ్రీనివాసులు కడప నుంచి ఆటోలో అనంతపురం వైపు వెళ్తున్నాడు. జ్వాలాపురం క్రాస్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ దారిలో వెళ్తున్న వాహనదారులు అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే పంచాయతీలోని బండకిందపల్లికి చెందిన రాము, రవి శనివారం ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి మండల కేంద్రమైన ఓబుళదేవరచెరువుకు వెళ్తున్నారు. వెంకటాపురం మలుపు వద్ద వాహనం అదుపు తప్పి వారిద్దరు కిందపడినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిద్దిరిని స్థానికులు 108 వాహనంలో కదిరికి తరలించారు.

నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

నంబులపూలకుంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌకనపల్లి క్రాస్ సమీపంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామాంజులరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రిఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. ఈ శిబిరానికి హాజరైన వారికి ఉచిత భోజనం, రవాణా సౌకర్యం, ఉచిత ఆపరేషన్లు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వాహకులు రామాంజులరెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

జిల్లా జట్టుకు ధర్మవరం బాలిక ఎంపిక



ఎంపికైన బాలికను అభినందిస్తున్న వడ్డే బాలాజీ, శివశంకర్

ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న జెన్నే గోపిచందన అండర్-15 బాలికల విభాగం అనంతపురం జట్టుకు ఎంపికైనట్లు క్రికెట్ కోచ్ రాజశేఖర్ తెలిపారు. అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో శనివారం జరిగిన ఎంపిక ప్రక్రియలో ఆమె ఎంపికైనట్లు తెలిపిరు. నెల్లూరులో ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఆమె అనంతపురం జట్టు తరఫున పాల్గొంటారని కోచ్ తెలిపారు. ఆమెను క్రికెట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు వడ్డే బాలాజీ, కార్యదర్శి శివశంకర్ అభినందించారు. ఆర్డీటీ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేయడం వల్ల ప్రతిభ ఉన్న ప్రతిక్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రస్తుతం వేసవి సెలవులు ముగింపు సమయం కావడంతో విద్యార్థులు, భక్తులు భారీగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ అధికారులు ఉచిత అన్నదాన సౌకర్యం కల్పించారు.



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

తాగునీటికి కటకట..!

● మరమ్మతులకు గురైన పంచాయతీ బోర్లు

● ఇబ్బందులు పడుతున్న నడిమిగడ్డపల్లి ఎస్సీ కాలనీ, తాటిమానుగుంత వాసులు

ధర్మవరం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిగడ్డపల్లి ఎస్సీకాలనీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. కాలనీలో సుమారు 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే కాలనీకి సంబంధించిన పంచాయతీ బోరు మరమ్మతులకు గురి కావడంతో తాగునీటికి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో నుంచి తాగునీరు అరకొరగా వస్తుండటంతో... సమీప వ్యవసాయ పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని కాలనీ ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ బోరుకు మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు. బోరు నుంచి నీరు పుష్కలంగా వస్తుండేదని, మరమ్మతులకు రావడంతో నీటి సమస్య తలెత్తిందంటున్నారు. అధికారులు స్పందించి పంచాయతీ బోరుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



నడిమిగడ్డపల్లి ఎస్సీకాలనీలో మరమ్మతులకు గురైన పంచాయతీ బోరు

బోరు రిపేరీకి వచ్చి సమస్య



పంచాయతీ బోరు రిపేరీకి రావడంతో మాకు తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో నుంచి నీరు అరకొరగా వస్తున్నాయి. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వచ్చి బోరు రిపేరీ చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలి. **- మారెక్క, నడిమిగడ్డపల్లి కాలనీ**

రెండు రోజుల్లో పరిష్కారిస్తాం



రెండు రోజుల్లో బోరు రిపేరీ చేయించి నడిమిగడ్డపల్లి ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారిస్తాం. ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉండకుండా చర్యలు చేపట్టాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

- సాయిమనోహర్, ఎంపీడీఓ ధర్మవరం

తాటిమాను గుంతలో...

నంబులపూలకుంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిమాను గుంత గ్రామంలో 20రోజులకు పైగా తాగునీటి ఎద్దడి నెలకొందని, పట్టించుకునే వారు లేరని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో వంద కుటుంబాలున్నాయి. అందరూ వ్యవసాయ పనులు, కూలి పనులకు వెళ్లేవారే. గ్రామంలోని రక్షిత తాగునీటి బోరు మోటారు దాదాపు ఇరవై రోజుల క్రితం కాలిపోయింది. బోరులో నుంచి మోటారు, పైపులు బయటకు తీసి 20 రోజులకు పైగా అవుతోంది. దీంతో తాగునీటికి, పశువుల దాహార్తి తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలుపుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. దీంతో కరెంటు వచ్చినప్పుడు గ్రామానికి చెందిన లక్ష్మయ్య, నరసింహులు అనే రైతుల వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి బిందెలతో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆ సయమంలో కూలికి వెళ్లినా, పశువులను మేత తొలుకెళ్లినా తాగునీటి కోసం తిప్పలు తప్పవంటున్నారు. దీంతో ఇంటికొక మనిషిని కేటాయించి అరకొరగా నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నామంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

సమస్యలను పరిశీలించిన కమిషనర్



కొళాయిలో వచ్చిన కలుషితనీటిని పరిశీలిస్తున్న కమిషనర్

ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శనివారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. పలు వార్డులలో నెలకొన్న సమస్యలను టీడీపీ నాయకులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్‌కు ఆయన సూచించారు. దీంతో వారు ఇతర అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. పట్టణంలోని 8, 12, 14, 34 వార్డులలో విద్యుత్ స్తంభాల మార్పు, ఇళ్లపై కరెంటు తీగలు ఉండటం తదితర సమస్యలను పరిశీలించారు. తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామని ఏడీ హామీ ఇచ్చారు. అలాగే పార్థసారథినగర్‌లో మున్సిపల్ తాగునీటి పైపులైన్ ద్వారా కొళాయిల్లో సరఫరా అయిన కలుషిత నీటిని కమిషనర్ పరిశీ లించారు. వెంటనే మున్సిపల్ డీఈ వీరేశ్, ఫిట్టర్ నాగరాజును పిలిపించి తక్షణమే పైపులైన్ మార్చాలని ఆదేశించారు.

పాపం షేక్ ఫిరాన్ సాబ్

● గత ప్రభుత్వంలో రికార్డుల నుంచి తొలగించిన వలంటీర్లు

● పింఛన్, రేషన్ సరుకులు అందక ఇబ్బందులు



తనకల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొక్కంటి గ్రామానికి చెందిన షేక్ ఫిరాన్ సాబ్ 1946 లో ఆధార్ ప్రకారం జన్మించారు. ఎన్నో యేళ్లుగా గ్రామంలోనే నివాసమున్నారు. రేషన్‌కార్డు నెంబర్ 2806315888 కూడా ఉంది. వైసీపీ వలంటీర్లు సర్వేలు నిర్వహించినప్పుడు అతడు గ్రామంలో లేకపోవడంతో రికార్డుల పరంగా చంపేశారు. దీంతో అతడికి బియ్యం, పింఛన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలనలో నాలుగేళ్లపాటు అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా, ఎవరూ స్పందించలేదు. ఈ ప్రభుత్వ ఏర్పడి తరవాత కూడా యేడాదిగా అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. బతికున్న తనను చంపేశారని, ఎన్నిమార్లు తహసీల్దార్ చుట్టు తిరుగుతున్నా, సమస్య పరిష్కరం కాలేదన్నారు. తనకు బియ్యంకార్డు లేకపోవడంతో పాటు పింఛన్ రాక ఇబ్బం దులు పడుతున్నట్లు ఆవేదన చెందారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి, తనను రికార్డుల్లో బతికించి, బియ్యం, పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీనియార్టీ జాబితాలో లోపాలు సవరించాలి

● డీఈఓకు డీటీఎఫ్ నాయకుల వినతి

ఓబుళదేవరచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియార్టీ జాబితాలోని లోపాలను సవరించాలని కోరుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా డీఈఓ ప్రసాద్ బాబుకు శనివారం విన్నవించినట్లు డీటీఎఫ్ నాయకులు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జార్జి, సత్యసాయి జిల్లా ప్రతినిధి గౌస్‌లాజం మాట్లాడుతూ... జాబితాలోని పలువురికి సీలింగ్ పాయింట్లు కంటే ఎక్కువ నమోదు చేసినట్లు చెప్పారు. అవివా హితకు ఎక్కువ పాయింట్లు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటితో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని అనంతపురంలోని శారద ఉన్నత పాఠశాలలో డీఈఓను కలిసి విన్నవించినట్లు వారు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

అమడగూరు (కదిరి), జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో మారుతి అనే రైతుకు చెందిన వ్యవసాయ బోరుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. మారుతి నూతనంగా బోరు వేసుకున్నాడు. విద్యుత్ అధికారులు మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ అందించారు. పొలంలో సాగుచేసిన మొక్క జొన్న పంట మొలకెత్తుతోంది. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టారని, అయితే అందులో అందులో అల్యూమినియం వైరు ఉండడంతో వదిలి వెళ్లిపోయారని తెలిపాడు. ప్రస్తుతం ఆ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రూ. 20వేలు ఖర్చు అవుతుందని బాధిత రైతు వాపోయాడు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు ఆయన తెలిపారు.

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు

● వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



పంటల సాగు వివరాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

తనకల్లు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తనకల్లు, మల్లిరెడ్డిపల్లిల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రెడ్డిపల్లి ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, హైదరాబాద్ నూనె గింజల విభాగం శాస్త్రవేత్త గుర్రై మురగన్ తదితరులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యవసాయంలో అధిక మోతాదులో ఎరువులు, పురుగు ముందులు ఉప యోగించే విధానానికి స్వస్తిపలకాలన్నారు. పంటల సాగులో వైవిధ్యం పాటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలు, డ్రోన్‌ల ద్వారా మందుల పిచికారి తదితర విషయాలపై వివరిం చారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, ఆత్మా, రైతు సేవాకేంద్రాలు, జనజాగృతి, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నష్టాల బాటలో బూడిద గుమ్మడి రైతులు

గాండ్లపెంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పలువురు రైతులు బూడిద గుమ్మడి పంట సాగుచేశారు. అయితే ఈ యేడాది ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్ట పోయామని రైతులు వాపోతున్నారు. రబీలో వ్యవసాయ బోర్ల కింద తీగజాతి బూడిదగుమ్మడిని సాగుచేశారు. గతయేడాది మంచి లాభాలు రావడంతో, ఈ యేడాది కూడా ఆశించిన ధరలు ఉంటాయని ఎంతో భావించారు. దీంతో రైతులు మండలంలో దాదాపు 400 ఎకరాలకుపైగా బూడిద గుమ్మడి సాగుచేశారు. పంట సాగు కోసం ఎకరాకు రూ. 30వేలు ఖర్చు చేసినట్లు రైతులు తెలుపుతున్నారు. అయితే ఈ యేడాది ధరలు పూర్తిగా పతనం కావడంతో రైతులు కాయలను పొలాల్లోనే వదిలేశారు. ప్రస్తుత ధరలతో పెట్టబడులు కూడా రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బూడిదగుమ్మడి పంట సాగుచేసి, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ధర లేక పొలంలోనే వదిలేసిన బూడిద గుమ్మడి పంట

భక్తి శ్రద్ధలతో బక్రీద్

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తి, నియోజకవర్గ కేంద్రాలైన ధర్మవరం, కదిరి పట్టణాల్లో ఈద్గా మైదానాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అలాగే మండలకేంద్రాలైన తాడిమర్రి, కొత్త చెరువు, బుక్కపట్నం, బత్తలపల్లి, ముదిగుబ్బ, నంబులపూల కుంట, ఓబుళదేవర చెరువు, నల్లచెరువు, నల్లమాడ, తనకల్లుతో పాటు ఆయా మండలాల్లో పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ముస్లిం మత పెద్దలు, ముతవల్లీలు బక్రీద్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింటు ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.



తాడిమర్రిలో ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బుక్కపట్నంలో...



ముదిగుబ్బ పాతవూరు ఈద్గా వద్ద ప్రసంగిస్తున్న మతపెద్ద



ఓడీసీలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కదిరిలో శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకుడు షేక్ బాబాయ్య



గాండ్లపెంటలో...



నల్లమాడలో...

అంధకారంలో వెలిచలమల క్రాస్



నంబులపూలకుంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వెలిచలమల క్రాస్ అంధకారంలో మగ్గుతున్నట్లు స్థానికులు వా పోతున్నారు. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటుచేసిన బల్బులు వెలగడం లేదంటున్నారు. దీంతో రాత్రిళ్లు బయటకు రావాలంటే భ యపడుతున్నట్లు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని భయాందోళన చెందుతున్నామన్నారు. ప్రస్తుతం చోరీలు కూడా అక్కడక్కడ జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

సెమీ ఫైనల్స్‌కు చేరిన జిల్లా జట్టు



విజయం సాధించిన సత్యసాయి జిల్లా జట్టుతో కోచ్, మేనేజర్

ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు సత్తాచాటింది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరంలోని బీఎస్‌ఆర్ కళాశాల మైదానంలో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో రెండో రోజు గోల్స్ వర్షం కురిపించింది. సెమీఫైనల్‌కు చేరింది. ఉదయం జరిగిన మ్యాచ్‌లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు 11-0గోల్స్ తేడాతో నెల్లూరు జట్టును ఓడించినట్లు కోచ్ మారుతీ కుమార్, మేనేజర్ అరవింద గౌడ్ తెలిపారు. జిల్లా జట్టులోని నసీమా- 3గోల్స్, నవ్యశ్రీ-3, మాధురి బాయ్-2, ప్రవిత, వైష్ణవి, వర్ష ఒక్కొక్కరు ఒక గోల్ చేసి జట్టు విజయానికి కారకులయ్యారని వారు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో తిరుపతి జిల్లా జట్టును 3-1గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టు ఓడించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నట్టు కోచ్, మేనేజర్‌లు పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో హేమ, నసీమా, మధురిమ ఒక్కో గోల్ చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



విద్యుత్ సరఫరాతో పని చేస్తున్న వ్యవసాయబోర్లు

మడకశిర రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తడకలపల్లి రైతు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆశాఖ అధికారులు మరమ్మతులు చేశారు. ఆంధ్రజ్యోతిలో శనివారం పనిచేయని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..! శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. 20 రోజులుగా విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ పనిచేయడంలేదు. రైతులు సాగుచేసిన పంటలు ఎండముఖపట్టుతున్నాయి. అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు.

రేపు ప్రమాణ స్వీకారం

మడకశిర టౌన్, జూన్7(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ పాలకమండలి ప్రమాణ స్వీకారం ఈనెల 9వ తేదీన మార్కెట్‌యార్డ్‌లో ఉంటుందని కమిటీ చైర్మన్ గురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కమిటీని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారని, ఆ మేరకు చైర్మన్‌తోపాటు వైస్‌చైర్మన్ శ్రీదేవి, డైరెక్టర్లు ఎస్ బద్రి, బీకే భాగ్యలక్ష్మి, గౌరమ్మ, ఎన్ కుసుమ, ఎస్ఎన్ మీనాక్షి, ఎం శ్రీనివాసులు, వీ సునీతమ్మ, టీ శిల్ప, విరూపాక్షప్ప, ఎంఆర్ శివరాములు, బీఆర్ రత్నశ్రీ, ఎంవీ రమేష్ తదితరులు ప్రమాణస్వీకారం చేయనున్నారన్నారు.

ఇదేనా స్వచ్ఛ పెనుకొండ...?



పాత పోస్టాఫీస్ వద్ద పేరుకుపోయిన చెత్త

పెనుకొండ, జూన్7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్-స్వచ్ఛ పెనుకొండ అంటూ ప్రతిరోజు అధికారులు నినాదాలు చేస్తున్న అది ఆచరణలో మాత్రం పూర్తిస్థాయిలో జరగడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని ఎగువగడ్డ వీధిలో పాత పోస్టాఫీస్ వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. గాలికి చెత్తచెదారం రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు

పెనుకొండ, జూన్7(ఆంధ్రజ్యోతి): ఎల్‌పీజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాఘవేంద్ర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వంటగ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం శెట్టిపల్లి గ్రామంలో వంటగ్యాస్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ ప్రయోగపూర్వకంగా ప్రదర్శన చేశారు. వంటగ్యాస్ వినియోగంలో సమస్యలు తలెత్తితే స్వయంగా మరమ్మతులు చేసుకోకుండా కార్యాలయానికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు



కార్యకర్తను పరామర్శిస్తున్న శ్రీనివాసులు తదితరులు

చిలమత్తూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకి పార్టీ అండగా ఉంటుందని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని సోమఘట్ట పంచాయతీ చెరువుకిందపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కురుబ రమేష్‌ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అధైర్యపడవద్దని సూచించారు. ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి ప్రభుత్వం తరపున సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన మండల కన్వీనర్‌గా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో సోమఘట్టలో ఉన్న టీడీపీ నాయకులు తిప్పారెడ్డి, లక్ష్మీనరసప్ప, గోవిందప్ప తదితరులు నాయకులు, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు.

జనసేన నాయకుల అభినందనలు

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ కన్వీనర్‌గా కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎగువింటి శ్రీనివాసులను జనసేన నాయకులు శనివారం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. జనసేన నాయకులు చిన్నప్రవీణ్, రమణ, అగ్గిశీన, వెంకటశివ, ఆంజినేయులు, మనోహర్, వెంకటాద్రి, కృష్ణమూర్తి, సోమశేఖర్ తదితరులు ఆయన స్వగృహానికి సత్కరించారు. ప్రభుత్వ పాలనకు జనసేన తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

గోరంట్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శీనప్పపల్లి గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు లక్ష్మీకాంత్ పాముకాటుకు గురై అస్వస్థతకులోనయ్యాడు. రామాంజనేయులు కుమారుడైన లక్ష్మీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పొలానికి వెళ్లాడు. బాలుడు ఆడుకుటుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ తేజస్విని చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో పుట్టపర్తికి తరలించారు.

అక్కడికా... వద్దులేప్పా..!

వాణిజ్య కేంద్రానికి రాబోమంటున్న పోలీసులు
పురం నుంచి బయటికి వెళ్లేవారే గాని వచ్చేవారేరీ ?
సబ్‌డివిజన్‌లో బదిలీలతో ఎస్‌హెచ్‌ఓలకు ఇక్కట్లు



హిందూపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): హిందూపురం సబ్‌డివిజన్‌కు రావడానికి పోలీసు సిబ్బంది జంకుతున్నారు. గత ఆరేడు సంవత్స రాలుగా అక్కడ జరిగిన సంఘటనలే ఇందుకు కారణమనే అభిప్రా యాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకరిద్దరు సిబ్బంది చేసిన తప్పిదాల వలన ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో అక్కడికి మాత్రం మాకు పోస్టింగ్ వద్దంటూ మొరపెట్టుకుంటున్నారు. దీంతో హిందూపురం సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్లో సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కూడా మరికొంత మంది బయటికి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. దీంతో వచ్చేవారు లేక ఎస్‌హెచ్‌ఓలు తీవ్రంగా మథన పడుతున్నట్లు సమాచారం. నేరస్థులను గుర్తించడంలో అధికారుల కంటే కిందిస్థాయి పోలీసు సిబ్బందిదే కీలక పాత్ర ఉంటుంది. ఎందుకంటే స్టేషన్లో పనిచేసే సిబ్బంది ఒక సబ్‌డివిజన్లో, లేదా పక్క సబ్‌డివిజన్‌లో ఐదు నుంచి పదేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు. అదే ఎస్‌ఐ లేక సీఐలు అయితే రెండు మూడు సంవత్సరాలు మాత్రమే పని చేసి వెళ్లిపోతారు. దీనివల్లనే కానిస్టేబుళ్లపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. అందుకే సరిపడ సిబ్బంది లేకపోతే ఇబ్బందులు తప్పవని ఎస్‌ఐ స్థాయి అధికారులు మథనపడుతున్నారు.

గతానికి భిన్నంగా ప్రస్తుత పరిస్థితి

హిందూపురం వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. దీంతో పాటు ఇక్కడ క్రైం రేటు తక్కువగా ఉంటుందని, బెంగళూరుకు దగ్గరగా ఉంటుందని ఇక్కడికి బదిలీపై రావడానికి చాలా మంది పైరవీలు చేసేవారు. కానీ జరిగిన కొన్ని సంఘటనలతో పరిస్థితి భిన్నంగా మారింది. దీంతో ఖాళీలు చూపుతున్నా ఇక్కడకు వచ్చేందుకు పోలీసులు ఆసక్తి చూపడం లేదు. శుక్రవారం జరిగిన బదిలీల్లో ఇతర సబ్ డివిజన్‌లకు చెందిన కొందరికి ఇక్కడికి అవకాశం వచ్చినా వేరే సబ్‌డివిజన్‌కి వెళతామని కోరుకున్నట్లు తెలిసింది. హిందూపురం సబ్‌డివిజన్‌లో పట్టణంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు స్టేషన్లలో చాలా ఖాళీలు ఉన్నాయి. దీని వలన ఉన్న సిబ్బందికి పనిభారం అధికమవుతోంది. పట్టణంలో అయితే పగలు రాత్రి కూడా ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ముప్పైమంది పోలీసులు ఉండాల్సి ఉండగా, 10, 11 మందితోనే విధులను నిర్వర్తిస్తున్నారు. దీని వలన ముగ్గురు పని ఒకరే చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలోనే ఇక్కడకు రావడానికి సిబ్బంది సుముఖత చూపడం లేదని పోలీసులే చెబుతున్నారు.

ఇలా అయితే శాంతి భద్రతలు ఎలా ?

ప్రస్తుతం సిబ్బంది కొరత వేధిస్తుండటంతో ఏవైనా నేరాలు జరిగినప్పుడు పక్క పోలీస్ స్టేషన్ సిబ్బందిని పిలుపించుకోవాల్సి వస్తోంది. గతంలో కంటే పరిస్థితి భిన్నంగా ఉండటంతో పురం ప్రాంతంలో ఇటీవల క్రైం రేటు పెరిగింది. దీంతో ఉన్న సిబ్బంది కంటే అధికంగా కేటాయించినా ఇంకా తక్కువగానే ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది ఇక్కడికి రాకపోవడంతో శాంతి భద్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. సిబ్బంది కొరతవల్ల ఏదైనా జరిగరానిది జరిగితే బాధ్యులు ఎవరనేది పోలీసు అధికారులకే తెలియాల్సి ఉంది.

ఇన్‌చార్జ్‌ల పాలనతో ఇక్కట్లు

అందుబాటులో ఉండని అధికారులు
నిత్యం కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు, భూ పరిహార బాధితుల ప్రదక్షిణలు



మడకశిర తహసీల్దార్ కార్యాలయం

మడకశిర టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జిల పాలనతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇన్‌చార్జిలు విధులు నిర్వహిస్తుండటంతో పూర్తిస్థాయిలో అధికారులు నిర్ణయాలు తీసుకోలేకపోతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పండంలేదు. ఐదు మండలాలకుగాను అమరాపురం, అగళి, గుడిబండ మండల రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్లు లేకపోవడంతో ఇన్‌చార్జిలుగా ఇతర మండలాల వారికి బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమైన శాఖల్లో అధికారులు ఎఫ్ఏసీలుగా ఉండటంతో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రెవెన్యూ కార్యాలయంలో సమస్యలు మరింత ఎక్కువగా ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకంతోపాటు రైల్వే, నేషనల్ హైవే, భూములు కోల్పోయిన రైతులు పరిహారంతోపాటు ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. రైల్వేలైన్, నేషనల్ హైవే భూములు కోల్పోయిన రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని బాధితులు అంటున్నారు. తమకు రావాల్సిన వాటామేరకు పరిహారం అందించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పోస్టులకు రెగ్యులర్ అధికారులు నియమించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అమరాపురం మండలంలో

తహసీల్దార్, ఈఓఆర్డీ పోస్టులతోపాటు కే.శివరాం,హేమావతి, వి.అగ్రహారం, మద్దనకుంట తదితర పంచాయతీల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతోపాటు పలు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు, ఇంజనీర్ అసిసెంట్లు ఇలా పలు ఖాళీలతో ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు.

అగళి...

తహసీల్దార్, ఎంఈఓ, ఏపీఓ, ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు పలు పంచాయతీలో రెగ్యులర్ వీఆర్‌ఓలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

గుడిబండ..

తహసీల్దార్ పోస్టుతోపాటు సి.సి. గిరి వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, కొంకల్లు వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, మోరుబాగల్‌రాళ్లపల్లి, జంబులబండ తదితర పంచాయతీల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతోపాటు పలు కార్యాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల తమకు ఇబ్బందులు తప్పడం లేదని ఆయా ప్రాంతాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మడకశిర..

డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు మెళవాయి, చత్రం, గోవిందపురం, గంగుళవాయి పాళ్యం, మణూరు ఇలా ఏడు పంచాయతీల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ సైతం లేడు. ఆయా ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇన్‌చార్జిలుగా ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారిని నియమించారు. కొన్ని ప్రాంతాల్లో రెండు మూడు ప్రాంతాలకు కూడా ఇన్‌చార్జిలను నియమించారు. దీంతో వారు విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని, తమ సమస్యలు ఎక్కడపడితే అక్కడే ఉన్నాయని లబ్ధిదారులు, బాధితులు అంటున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కొన్ని నెలలుగా తిరుగుతున్నా



గ్రామంలో నాకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిలో వాటానే లేదని అంటున్నారు. దీంతో రావాల్సిన వాటా కోసం కొన్ని నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్‌కు సైతం అన్ని డాక్యుమెంట్లను సమర్పించా. అయినా నా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా నాకు రావాల్సిన భూమిని వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- కురబ నటరాజు, భీమరాయనపల్లి

ప్రయోజనం లేదు



పట్టాదారు పాసు పుస్తకం కోసం అనేక సార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. అయినా ప్రయోజనం లేదు. ఇన్‌చార్జిలు ఉండడం వల్ల సమస్య పరిష్కారం కావడం లేదు. మాకు వంశపారం పర్యంగా సంక్రమించే జమీనుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

\- మారెక్క, హేమావతి, అమరాపురం మండలం

సేంద్రియ ఎరువుల వాడకంతోనే అధిక దిగుబడులు



భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న శాస్త్రవేత్త హరిత

గుడిబండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకానికి స్వస్తి పలికి సేంద్రియ ఎరువులను వాడితే అధిక దిగుబడులు సాధ్యమని కల్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలాజీనాయక్ సూచించారు. శనివారం మండలంలోని రాళ్లపల్లి, రైతుసేవ కేంద్రం ఆవరణంలో రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని 700 జిల్లాల్లో రెండువేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాలను గ్రామాల్లో పర్యటించి రైతులకు నూతన సాంకేతిక వ్యవసాయంపై అవగాహనను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా రైతులకు నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ తదితర వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. రైతులు సాగుచేసే వరి, రాగి, మొక్కజొన్న తదితర పంటలకు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే ప్రయోజనం ఉంటుందన్నారు. సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధ్యమన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవీ వీరానరేష్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి

మడకశిర రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని రైతులకు కళ్యాణదుర్గానికి చెందిన కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరిణి సూచించారు.శనివారం ఆమిదాలగింది పంచాయతీ కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు అందరూ తప్పనిసారిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. అదేవిధంగా వ్యవసాయసాగుపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి తిమ్మప్ప, ప్రకృతి వ్యవసాయం డివిజనల్ అధికారి రమేష్, మమత, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి: వైసీపీ

మడకశిర టౌన్, జూన్7(ఆంధ్రజ్యోతి): రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వెంటనే ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్‌రంగారెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి రైతులకు అవసరమయిన విత్తన వేరుశనగతోపాటు ఇతర విత్తనాలు అందించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో వక్కలిగా సాధికరత రాష్ట్ర కన్వీనర్ జి.రంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర

మడకశిర టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని జ్యోతిరావు పూలె విగ్రహం వద్ద యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలతోపాటు పలువురు టీడీపీ నాయకులు హాజరవుతారన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

మతపెద్దలు: భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకున్న ముస్లింలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి, విశ్వాసానికి బక్రీద్ ప్రతీక అని ముస్లిం మత పెద్దలు అన్నారు. శనివారం బక్రీద్‌ని పురస్కరించుకొని హిందూపురంలోని ఈద్గా మైదానంలో ఉదయం 7.30 గంటల నుంచే ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మానవత విలువలకు ప్రాతినిథ్యం వహించి మత సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు బక్రీద్ జరుపుకుంటారన్నారు. సమాజ శాంతి కోసం ప్రార్థనలు చేశామన్నారు. పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానాలు ముస్లింలతో కిక్కిరిశాయి. మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టీడీపీ నాయకులు అమరనాథ్ తదితరులు ఈద్గా మైదానాలకు వెళ్లి ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపారు. పట్టణంలోని ఆల్‌హిలాల్, రహమత్‌పురం, లింకంపల్లి, ఆర్టీసీ కాలనీ, హస్నాబాద్‌లోని ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు జరిగాయి.



అమరాపురం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మడకశిరటౌన్: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



పెనుకొండ: ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు



పరిగి: ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ సాబ్ నసీర్ అహ్మద్, కమ్మద్దీన్, మసీదు కమిటీ సభ్యులు మహబూబ్‌ఖాన్, సలీం, మున్నజీయుల్లా, ఇంతియాజ్, శన్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల: పట్టణంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. భద్రతా చర్యలు చేపడుతున్న సిఐ శేఖర్‌ను టీడీపీ మైనార్టీనాయకుడు అజంతుల్లా సన్మానించారు. ప్రార్థనల్లో మౌలానా మహ్మద్, అబ్దుల్‌ఫైజ్, ఫారూక్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం: హేమావతిలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



పావగడ: బక్రీద్ సందర్భంగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈద్గాలో ప్రార్థనలు చేశారు. ముతవల్లి లతీఫ్‌సాబ్, మహ్మద్ జావీద్, అన్వర్‌సాబ్, ఆర్‌కే నిస్సార్, ఆర్‌టీ ఖాన్, ఇమ్రాన్, షాబాబ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.